కథ

# కన్నతల్లి

పాలంకి సత్య

"ఏమ్మా సంధ్యా, సంబంధం నీకు నచ్చిందా?'' అన్నారు నాన్న. మధ్యవర్తి అప్పుడే వివరాలు చెప్పి వెళ్లాడు. అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఇద్దరే అన్నతమ్ముళ్లు. పెద్దకొడుకు ఎం.బి.ఏ. చేసి పెద్ద కంపెనీలో మేనేజరుగా ఉన్నాడు.

నాన్న తత్వమే అంత. నన్నడగకుండా నా విషయంలో ఏ నిర్ణయమూ తీసుకోరు. నాకు నచ్చినట్లుగానే మాథమాటిక్స్‌లో ఎం.ఎస్.సి. చెప్పించారు. నాకు సంస్కృతమంటే ఇష్టమంటే ఓపెన్ యూనివర్సిటీలో సంస్కృతంలో ఎం.ఎ చేయించారు. ఇప్పుడు పెళ్లి సంబంధమైనా ముందు నా ఇష్టాల్ని కనుక్కుని కానీ ముందుకెళ్లరు.

నేను జవాబు చెప్పేలోగానే అమ్మ "అన్నీ బాగానే ఉన్నాయి. కానీ మగ దిక్కు లేని సంసారం. చిన్నప్పుడే భర్త పోతే ఆవిడ పిల్లల్ని పెంచి పెద్ద చేసిందట. అలాంటావిడ వాళ్లు తాము కష్టాలు అనుభవించామన్న బాధలోనే ఉంటారు'' అంది.

"ఎప్పుడో పాతకాలం కబుర్లు చెప్తున్నావు. వితంతువుల మీద సాటి స్త్రీవి నువ్వే జాలి చూపించకపోతే ఎలా?''

అమ్మ ఇంకేం మాట్లాడలేదు. నేను "వివరాలు బావున్నాయి నాన్నా. మనుషుల్ని చూసి కానీ పూర్తి నిర్ణయం తీసుకోలేం కదా'' అన్నాను.

పెళ్లి చూపులకి తల్లీ, ఇద్దరు కొడుకులూ, కోడలూ వచ్చారు. అందరూ మర్యాదగానే ఉన్నారు. ఆవిడ "నేను కష్టం, సుఖం తెలిసిన మనిషిని. నాకు కట్నం వద్దు. అమ్మాయి గుణగణాలే ముఖ్యం'' అంది.

సంబంధం కాదనడానికి కారణాలేమీ కనిపించలేదు. ఒక మంచి ముహూర్తాన కొత్తకోడలిగా అత్తవారింట్లో అడుగుపెట్టాను. మొదటి రోజు కొత్తగా ఉన్నందు వల్ల హాల్లోనే కూచున్నాను. మధ్యాహ్నం రెండింటికి మా బావగారు సురేష్ ఇంటికి వచ్చి ముఖం కడుక్కుందుకు బాత్రూంలోకి వెళ్లారు. మా తోటికోడలు రేఖ తువ్వాలు పట్టుకుని లోపలకు వెళ్లింది. తర్వాత ఆశ్చర్యంగా అడిగాను. "అదేమిటి ఇంత చదువుకుని ఇంకా తువ్వాలు కూడా అందించేంత చాకిరీ చేస్తున్నావు?''

ఆమె నవ్వి "ఆయనతో మాట్లాడాలంటే అదే అవకాశం'' అంది.

నాకు ఏమీ అర్థం కాలేదు.

★ ★ ★

మర్నాడు ఉదయం నిద్ర లేచేసరికి మా వారు సతీష్ ఇంకా లేవలేదు. చిలిపి ఊహ వచ్చి ఆయన చేతిలో 'అయ్ లవ్ యూ' అని రాశాను. ఈలోగా తలుపు చప్పుడయింది. "అమ్మ పిలుస్తున్నట్లుంది లే'' అన్నారాయన.

"చేతిలో ఏం రాశానో చూశారా'' అన్నాను.

"తరువాత చెప్తువుగానీ అమ్మ పిలుస్తోంది. వెళ్లు. నాన్న పోయాక అమ్మ ఎంత కష్టపడి పెంచి పెద్ద చేసింది. ఆవిడని ఇప్పుడైనా మనం సుఖపెట్టాలి.''

నేను కొంత నిరుత్సాహంగానే లేచాను. పళ్లు తోముకునేసరికి మా అత్తగారు కాఫీ ఇచ్చారు. అప్పటికే మా తోటికోడలు వంటింట్లో ఉంది.

"కాఫీ తాగి బంగాళాదుంపలు రెండు తరుగు. అవి కాస్త వేయించేసి చారు పెడతాను. చిన్నాడికి కారేజి కట్టి ఇచ్చెయ్యొచ్చు'' అన్నారు అత్తగారు.

మా తోటికోడలు దోసెలు వేసి అన్నతమ్ముళిద్దరికీ పెట్టింది. మా అత్తగారు కట్టి ఇచ్చిన కారేజి మా వారికిస్తూ "మీ ఆఫీసులో కాటరింగ్ సర్వీస్ ఉండదా'' అన్నాను.

"అమ్మ చేతి వంట రుచి వస్తుందా'' అన్నారు.

అన్నతమ్ముళిద్దరూ వెళ్లాక అత్తగారు స్నానం చేసి మడి కట్టుకుని పూజ చేశారు. ఆ పైన వంట ప్రయత్నం మొదలెట్టారు. రెండు కూరలూ, సాంబారూ, చారూ, కొత్తిమీర పచ్చడీ, కందిపొడి (ఫ్రెష్‌గా ఎప్పటికప్పుడు గరిటెడు పప్పు వేయించి చెయ్యాలి) అప్పడాలు, వడియాలూ కలిపి భోజనం. 'హమ్మయ్య' అనుకునేసరికి మళ్లీ మా బావగారి కోసం వంట ప్రారంభం. ఆయనకి కూడా అమ్మ చేతి వంటే అమృతం. రెండింటికి వచ్చి భోజనం చేసి వెడతారు.

రాత్రి మళ్లీ రెండు కూరలూ, పచ్చళ్లూ, పులుసూ అన్నీ చేసుకుని "అమ్మా నీ చేతి వంట అమృతం'' అని కొడుకులు అంటూండగా భోంచేశాం. ఆ తర్వాత ఆయన తల్లితో కబుర్లు చెప్పి ఎప్పుడు వచ్చారో తెలియదు. నేను అలిసిపోయి పడుకున్నాను.

★ ★ ★

రెండు నెలలు గడిచాయి.

"ఏమిటీ రొటీన్ లైఫ్. రోజూ వండుకోవడం, తినడం. ఏ సరదా లేదు. సినిమా లేదు, షికారు లేదు'' అన్నాను.

"రెండు నెలలకే ఇలా అంటే ఎలా? ఆరేళ్ల నుంచీ ఇలాగే ఉన్నాను. తల్లిని గౌరవించవద్దని ఎవరూ అనరు. కానీ మనకీ కొన్ని కోరికలుంటాయి కదా. మా చెల్లి భర్త బాంకులో క్లర్కు. అయితేనేం దేశమంతా చూసింది. నాకన్నా ఎక్కువ సుఖపడుతోంది.''

మా అత్తగారు ఆవిడ చేసిన అరిసెలు పక్కింట్లో రుచి చూపించడానికి వెళ్లారు. అందుకే ఈ మాత్రమైనా స్వేచ్ఛ. మా తోటికోడలు టీవీ పెట్టింది. ఎవరో కౌన్సిలర్‌గారు బర్ర గొంతుతో జవాబులిస్తున్నాడు. ఒకమ్మాయి అత్తగారు పెడుతున్న బాధలు రాసుకుంది. ఆ మహానుభావుడు "మీ అత్తగారి అభద్రతా భావాన్ని అర్థం చేసుకోండి. ఇన్నాళ్లుగా కష్టపడి కని పెంచిన కొడుకు తనకి కాకుండా పోతాడన్న భయం ఆవిడలో ఉంది. మీరు ఆ భయం పోగొట్టాలి. ప్రతీ పనీ ఆవిడను సంప్రదించి చేయండి. అత్తయ్యా ఇలా చెయ్యమంటారా అని అడుగుతూ ఉండండి. ఆవిడ మిమ్మల్ని కన్నకూతురిలా చూసుకుంటారు'' అన్నాడు.

'ఛ' అంటూ తోటికోడలు టీవీ ఆపేసింది. "మన అమ్మా, నాన్నలు మనని పెంచలేదా? మనం కాకుండా పోతామన్న భయాలూ, అభద్రతా భావాలూ వాళ్లకి ఉండకూడదా? నీకూ, నాకూ అన్నతమ్ములు కూడా లేరు. అందునా నువ్వొక్కర్తివే అమ్మాయివి.''

నేను మాట్లాడేలోగా మా అత్తగారు వచ్చారు.

★ ★ ★

నాకు నెల తప్పింది. ఎంతో సంతోషంగా అనిపించింది. పెళ్లయిన కొత్తలో ఉద్యోగం చేస్తానని అడిగాను. "నీకు ఉద్యోగం అవసరమేముంది? ఇంట్లో అన్ని సదుపాయాలున్నాయి. అమ్మని సుఖపెట్టడం మన ధర్మం. అందుకే వదిన కూడా ఉద్యోగం వద్దని అన్నయ్య చెప్పాడు'' అన్నారు మా వారు. ఎక్కడకూ సరదాగా వెళ్లడమూ లేదు. పాపో, బాబో పుడితే వాళ్లతోనైనా ఆనందంగా కాలం గడపచ్చనుకున్నాను.

తొమ్మిదో నెల దాకా పుట్టింటికి వెళ్లలేకపోయాను. "ఇప్పుడే వెళ్లిపోతే పాపం అమ్మకి కష్టం కదా'' అన్నారు. నేను కాకుండా ఇంట్లో ఇద్దరు ఆడవాళ్లున్నారు. రోజూ నాలుగు రకాల వంటలెందుకో అర్థం కాదు. వండుకోడం, తినడమేనా జీవి

తమంటే. పుట్టబోయే శిశువు గురించి కలలు కంటూ ఉంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఈ బిడ్డ కోసమే నేను జీవిస్తున్నాను అనుకునేదాన్ని.

* * *

మగపిల్లాడు పుట్టాడు. సిజేరియన్ చేసి తీశారు. బాబును గుండెలకు పొదువుకున్నాను. ''ఈ బాబు నా బాబు. నా రక్తం పంచుకు పుట్టిన బాబు. నా ప్రాణం కన్నా మిన్న అయిన నా బాబు'' అనుకుంటూ గుండెల మీద పడుకోబెట్టుకున్నాను. రక్తం ఎక్కిస్తున్న బాటిల్ నుంచి చేతికి గుచ్చిన సూది కానీ, ఆపరేషన్ కోసం కోసిన కుట్లు కానీ నాకు నొప్పి కల్గించలేదు.

* * *

అత్తవారి ఆదేశానుసారం ఇరవై ఒకటవ రోజునే బారసాల చేశారు. మూడో నెల దాకా ఆగితే బాగుండునని అమ్మ అనుకుంది. శాంతి నక్షత్రమట. రెండింటి దాకా హోమాలు చెయ్యాల్సి వచ్చింది. సాయంత్రం తొట్లో పెట్టి పేరంటం. అందరూ వచ్చారు. బాబుని కాసేపు తొట్లో ఉంచి ఆపై ఒళ్లో కూచోపెట్టుకున్నాను. అలసటగా ఉంది. అమ్మ తాంబూలాలిస్తోంది. ''అక్కా కాసేపు ఎత్తుకో'' అని మా తోటికోడలికి బాబుని ఇవ్వబోయాను.

ఫిరంగి గుళ్లలా వచ్చాయి అత్తగారి మాటలు.

''సంధ్యా, బుద్ధి లేదా, గొడ్రాలికి చంటిపిల్లాణ్ణిస్తావా?''

మా తోటికోడలు నిశ్చేష్టురాలైంది. అమ్మ ఆగిపోయింది. పేరంటాళ్లు నివ్వెరపోయారు.

''భగవంతుడు ఇవ్వాలి కదా వదినగారూ'' అంది అమ్మ.

''పిల్లల్లేని వాళ్లు మా ఇంటావంటా లేరు'' అందావిడ. ఎవరికీ దిక్కు తోచలేదు.


* * *

సిజేరియన్ అయినా మూడో నెలలోనే తిరిగి వచ్చెయ్యాల్సి వచ్చింది. ఆదివారం పుట్టాడని బాబుకి ఆదిత్య అని పేరు పెట్టుకున్నాను. ఏ కళనున్నారో మా వారు తల్లిని అడగకుండా ఒప్పుకున్నారు. ''మీ నాన్నగారు భాస్కరరావుగారి పేరన్న మాట'' అన్నారత్తగారు. ఆ ''ఏం మీ పేరు సూర్యకాంతం కదా'' అని నేననలేదు. అంటే పుట్టగతులుండవని తెలుసు.

బాబుతోనే వీలయినంత సమయం గడిపేదాన్ని. బాబు ఏడ్చినా ముద్దే, నవ్వినా ముద్దే, కాలివేళ్లు కదిలినా ముద్దే, తన చిన్నారి చేతులతో నా వేలు పట్టుకున్నా ముద్దే. పని చేసే సమయమొదిలేస్తే ప్రపంచమంతా బాబే నాకు.

అందుకే ఇంట్లో జరుగుతున్న కుట్ర ఆఖరుగా నాకే తెలిసింది. మా బావగారికి ఇంకో పెళ్లి చెయ్యాలని మా అత్తగారు ప్రయత్నిస్తున్నారు. ఏడ్చిన మా తోటికోడలితో మా బావగారు ''నిన్ను బాగా చూసుకుంటూనే ఉంటాను. వంశోద్ధారకుడు కావాలని అమ్మ తాపత్రయ పడుతోంది. ఆవిడ మా కోసం ఎంతో కష్టపడింది. ఆవిడను సుఖపెట్టాలి'' అన్నారట.

విషయం తెలిసిన మా తోటికోడలి తల్లిదండ్రులు ఉరుకులు పరుగుల మీద వచ్చారు. ''అమ్మాయిని డాక్టరుకి చూపించి వైద్యం



చేయిస్తాం. కొన్నాళ్లు అవకాశమివ్వండి'' అని కాళ్లా వేళ్లా పడ్డారు.

అత్తగారు ప్రసన్నమై ఒప్పుకున్నారు.

డ్యాక్టర్లు మా బావగారిని కూడా పరీక్షించారు. రెండు రోజుల్లో విషయం చెప్తామన్నారు.

★ ★ ★

రెండు రోజుల తర్వాత పిడుగులాంటి వార్త వచ్చింది. మా తోటికోడల్లో ఏ లోపమూ లేదు. మా బావగారిలో స్పెర్మ్ కౌంట్ అసలు లేదు.

అదే సాయంత్రం నా జీవితంలో అసలూహించని పిడుగు పడింది. మా అమ్మా నాన్నా ఆక్సిడెంట్‌లో పోయారని ఫోన్లో పక్కింటివాళ్లు చెప్పారు.

అప్పుడే ఇంటికి వచ్చిన మా వారిని పట్టుకుని ''ఏమండీ'' అని ఏడ్చాను. ''దీనికే బాధ ఏమిటి? మా అమ్మకి ఇంకా పెద్ద కష్టమొచ్చింది. నీ వయస్సున్నప్పుడే ఆవిడకు భర్త పోయాడు. ఎన్నో కష్టాలుపడి నిబ్బరంగా మమ్మల్ని పెంచింది.''

ఏమని ఏడవను, ఎందుకని ఏడవను?

మా అత్తగారు ''ఊరుకోమ్మా సంధ్యా వెంటనే బయల్దేరి వెళ్లండి. బాబుని తీసుకెళ్లకు. అక్కడ కార్యక్రమాలలోనూ, దుఃఖంలోనూ ఉండి నువ్వు చూసుకోలేవు'' అన్నారు. ''మరి పాలు'' అన్నాను. ''నాలుగు రోజులు డబ్బా పాలు పడతా నులే'' అన్నారు.

★ ★ ★

కర్మకాండ మా పినతండ్రి కొడుకు చేశాడు. పన్నెండో రోజునే బాబు కోసం వెనక్కి వచ్చేశాను. ఇంక నాకు మిగిలింది వాడొక్కడే. వాణ్ని బాగా పెంచుకోవాలి. మంచి కొడుకుగానే కాదు మంచి భర్తగా కూడా పెంచాలి. నా ప్రాణంలో ప్రాణం వాడే. వాడి కోసమే బతకాలి.

వస్తూనే బాబుని ఎత్తుకోబోయాను.

''అలసినట్లున్నావు. పడుకో. రేఖ చూసుకుంటుందిలే. తన దగ్గరే పడుకోనీ' నాకు ఏమీ అర్థం కాలేదు.

''కాదు. నా దగ్గరే పడుకోపెట్టుకుంటాను'' అంటూ తీసుకెళ్లి నా పక్కన పడుకోబెట్టుకున్నాను. బాబు నా చెయ్యి మీద చెయ్యి వేశాడు. ''నాకు మిగిలింది నువ్వేరా'' అన్నాను.

★ ★ ★

మర్నాడు ఉదయమే అత్తగారు ఇంటి పురోహితుడితో మాట్లాడుతున్నారు.

''దత్తతే ఉత్తమమనిపించింది. కోడలికా పిల్లలు పుట్టరని డ్యాక్టర్లు చెప్పారు. అలా అని చెప్పి మా వాడికి ఇంకో పెళ్లి చేసి ఆ పిల్ల బతుకు బుగ్గిచేస్తామా. అందుకే దత్తతకి నిర్ణయించాను. రేపు ఉదయానికి ముహూర్తం కుదిరింది మీరొచ్చి జరిపించాలి''

నేను నోరు మూసుకోలేకపోయాను. ''అదేమిటి లోపం బావగారిదన్నారుగా''

''ఆ డ్యాక్టరుది తప్పుట. ఇంకొకళ్లకి మళ్లీ చూపించాం.''

ఎలాంటి మనిషి? తన కొడుకులో లోపమనగానే ప్లేటు ఫిరాయించింది. కోడలిలో లోపముంటే ఇంకోలాంటి ఆలోచన. తను మాత్రం ఆడది కాదా? సాటి ఆడదానిపై సానుభూతి లేదా? ఇంతకీ దత్తత ఎవరిస్తున్నారో? ఎవరో బీద బంధువులకి ఆశ చూపించారేమో.

★ ★ ★

మర్నాడు ఉదయం ఇంట్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. పీటలు వేశారు. ఒక వైపు మా బావగారు, తోటికోడలూ కూచున్నారు.

''సతీష్, నువ్వూ, సంధ్యా బాబుని తీసుకొచ్చి కూచోండి''

నాకు కొన్ని క్షణాలకి కానీ విషయం అర్థం కాలేదు. నా బాబుని దత్తత ఇవ్వాలా? నాకు మాట మాత్రమైనా చెప్పలేదేం?

మా వారిని అదే విషయమడిగాను.

''ఇందులో చెప్పడానికేముంది? అమ్మ ఆలోచించే నిర్ణయించింది. ఏ అనాథాశ్రమంలోని పిల్లాడో అయితే తల్లిదండ్రుల గురించి తెలియదు. బంధువులైతే డబ్బు కోసం పీకుతూంటారు. మన పిల్లాడయితేనే మంచిది కదా.''

''నా బాబుని ఎలా ఇవ్వను?''

''ఇస్తే మాత్రం కష్టమేముంది? ఈ ఇంట్లోనే ఎదురుగానే ఉంటాడు కదా''

''నా బాబు...''

''నష్టమేముంది? మనకింకా పిల్లలు పుడతారు కదా''

ఏం చెప్తున్నారు? ఇదేమైనా ఆడుకునే బొమ్మా. ఒకటి పోతే ఇంకొకటి కొనుక్కుందుకు.

''పద ముహూర్తం టైం అవుతోంది.''

స్పృహ ఉందో లేదో తెలియని నన్ను తీసికెళ్లి పీటల మీద కూచోపెట్టి ఒళ్లో బాబుని పడుకోబెట్టారు. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. సంస్కృతం రాకపోయినా బావుండేది. మంత్రాలు అర్థమయ్యేవి కావు. దత్తత మంత్రాలలో ఒక దంపతులకి పుట్టిన సంతానం మరణించినట్లు మంత్రాలు చదివి రెండవ దంపతులకి పుట్టినట్లు చదువుతారు. ఇప్పుడు ఏం జరుగుతోంది.

''పిల్లవాడికి ఆదిత్య అన్న పేరు మార్చి ప్రకాష్ అని పెడతాం'' మా అత్తగారు చెప్తున్నారు. ఆవిడకేసి చూశాను. పెద్దకొడుక్కి పరువు పోకుండా చూశానన్న ఆనందం.

మా బావగారికేసి చూశాను. తన లోపం తెలియకుండా వంశోద్ధారకుడు దొరుకుతున్న సంతోషం. మా తోటికోడలికేసి చూశాను. తన సంసారం నిలబడిందన్న తృప్తి. మా వారికేసి చూశాను. అపర శ్రీరామచంద్రుడినన్న గర్వం.

నా బాబుకేసి చూశాను. నాకు మిగిలిన ఏకైక రక్తసంబంధం. తోబుట్టువులు లేరు. తల్లిదండ్రులు అకాల ధర్మం చెందారు. ఇక మిగిలింది వీడే.

పురోహితులు కర్మకాండ మంత్రాలు మొదలెట్టబోతున్నారు. శక్తినంతా కూడదీసుకుని దిగ్గున లేచాను. ఆపబోయిన వారి చేతిని విసిరికొట్టాను. నా బాబుతో నా గదిలోకి వెళ్లిపోయి తలుపు గడియ వేసుకున్నాను ప్రశాంతంగా ఆలోచించడం కోసం. నేనూ, బాబూ ఒకరికొకరం ఎలా జీవించాలో నిర్ణయించుకోవడం కోసం.

☆

## ఇదో రకం భజన

**రాణీ ముఖర్జీ-షారుఖ్ ఖాన్ కలిసి దాదాపు అరడజను సినిమాల వరకూ నటించారు. వీటిలో నటించేటప్పుడు తనకి అతను ఎన్నో మెళకువలు చెప్పి తన కెరీర్ చక్కగా సాగిపోవడానికి సహకరించాడని చెబుతోంది రాణీ ముఖర్జీ. వృత్తిపట్ల షారుఖ్ అంకిత భావం గురించయితే చెప్పనే అవసరం లేదు. ఇక కోస్టార్స్‌కి అతను అందించే సహకారం మరువలేనిది అంటుంది రాణి. తను షారుఖ్ నుంచి నేర్చుకోవాల్సినవి ఇంకా ఇంకా వుంది అని నొక్కి వక్కాణిస్తోంది రాణి.**

